

విద్యార్థులకు పంద్రాగస్టు ఆటల పోటీలు

ప్రజాశక్తి-పెదబయలు : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, ఆశ్రమాలు, హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. కొన్నాళ్లుగా కురుస్తున్న వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గురువారం నుంచి పలు పాఠశాలల్లో ఆటల పోటీలను ప్రారంభించారు. స్థానిక గురుకుల పాఠశాలలో విద్యార్థులకు జూనియర్, సీనియర్ విభాగాల్లో కబడ్డీ పోటీలను నిర్వహించారు.



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

ఆదివాసీ డిక్లరేషన్ ప్రకటించాలి



రాష్ట్ర సదస్సులో మాట్లాడుతున్న అప్పలనర్స, వేదికపై మాజీ ఎంపీ మిడియం బాబూరావు, సురేంద్ర తదితరులు

● ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర సదస్సులో వక్తలు

ప్రజాశక్తి- పాడేరు : ఆదివాసీ దినోత్సవ స్ఫూర్తితో ఆదివాసీ డిక్లరేషన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ప్రకటన చేసి, ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపి, వారికి న్యాయం చేయాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. గురువారం ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాడేరు పిఎంఆర్‌సిలో జిల్లా అధ్యక్షుడు ఎస్ ధర్మన్న పడాల్ అధ్యక్షతన 'ఆదివాసీ ప్రాంత సమగ్రాభివృద్ధి - సవాళ్లు' అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహించారు.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ వైస్‌చైర్మన్, మాజీ ఎంపీ మిడియం బాబూరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు మూడుసార్లు కేబినెట్ సమావేశాలు నిర్వహించడంతో పాటు గిరిజన సంక్షేమశాఖపై ప్రత్యేక సమీక్ష నిర్వహించినా జిఒ3 పునరుద్ధరణ, గిరిజన ప్రత్యేక డిఎస్‌సి, బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చే నిర్ణయం రద్దు వంటి వాటిపై ప్రకటన చేయకపోవడం శోచనీయమన్నారు. ఆదివాసీ దినోత్సవం రోజునైనా వీటిపై స్పష్టతనిచ్చి, ఆదివాసీల్లో ఆనందాలు వెల్లివిరిసేలా చేయాలన్నారు.

ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి అప్పలనర్స మాట్లాడుతూ గ్రామసభ ఆమోదం లేకుండానే హైడ్రో పవర్ ప్రాజెక్ట్, అక్రమ మైనింగ్, జాతీయ రహదారి ,పోలవరం ప్రాజెక్టు ఇలా పలు అంశాల్లో విచ్చలవిడి అనుమతులిస్తూ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. పదేళ్లుగా పీసా కమిటీ ఎన్నికలు నిర్వహించకుండా కాలం వెల్లదీయడం దుర్మార్గమన్నారు. గిరిజన సబ్‌ప్లాన్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించాలని, ఆదివాసీ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. .అటవీహక్కుల చట్టాన్ని అమలుచేసి ఉమ్మడి యాజమాన్యపు, వ్యక్తిగత హక్కుపత్రాల జారీలో జాప్యం నివారించాలన్నారు. అన్ని గ్రామాల్లో ఆదివాసీ మాతృభాషలో బోధన సాగించడం ద్వారా అంతరించిపోతున్న ఆదివాసీ మాతృభాషను పునరుజ్జీవింపచేయాలన్నారు మాతృభాష విద్యావాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలను పెంచాలని కోరారు.,ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజున సెలవుదినం ప్రకటించాలన్నారు. నాన్ షెడ్యూల్డ్ ఏరియా గ్రామాలను 5వ షెడ్యూల్డ్‌లో కలపాలని 1981 నుంచి ఉన్న డిమాండ్‌ను ఇప్పటికైనా సాకారం చేయాలని కోరారు.

రాష్ట్ర సదస్సులో పి.బాల్ దేవ్ ప్రవేశ పెట్టిన తీర్మానంపై ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ పివిటిజిల అభివృద్ధికి రూ.15వేల కోట్లు కేటాయించామని ఎన్నికల ముందు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం, అరకొర బడ్జెట్ కేటాయింపులతో అమలులో అన్యాయం చేసిందని మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులైన ఆదివాసీలకు పునరావాసం, నష్టపరిహారం చెల్లించకుండా, ఏటా వర్షాలు, వరదల సీజన్‌లో నిరాశ్రయుల్ని చేసి అవస్థలు పాల్జేయడం దుర్మార్గమన్నారు. గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోరాబు సత్యనారాయణ మాట్లాడుతూ ఆదివాసీల మాతృభాష, సంస్కృతిపై జరుగుతున్న దాడిని ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు.

ఆదివాసీ తీర్మానానికి రాష్ట్ర సదస్సు ఆమోదం

రాష్ట్ర సదస్సులో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్ తీర్మానాన్ని ప్రవేశ పెడుతూ... 'సహజ వనరులు, భూమి, ఉద్యోగం, విద్య తదితర ప్రత్యేకమైన హక్కులను 5వ షెడ్యూల్డ్ ఏరియా ఆదివాసీలకు దఖలు పర్చబడి వుందని, అయినా విద్యా, ఉపాధి, ఉద్యోగాల్లో గిరిజనేతరులు చొరబడి, నిజమైన గిరిజనులకు అన్యాయం చేస్తున్నారు. దీంతో వందలాది గిరిజన యువత అసాంఘిక కార్యకలాపాల వైపు మళ్లుతున్నారు. గంజాయి నివారణ చర్యల్లో భాగంగా యువతకు ఉద్యోగ, ఉపాధి రిజర్వేషన్ కల్పించాలి. వైద్య వ్యవస్థ మెరుగుపరిచాలి. ఏజెన్సీలో అక్రమ నిర్మాణాలను ప్రోత్సాహిస్తున్న రెవిన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి, ఆదివాసులు, పివిటిజిల ఇళ్ల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.6 లక్షల కేటాయించాలి' అంటూ తీర్మానంలో పేర్కొనగా, దీనికి .రాష్ట్ర సదస్సు ఆమోదం తెలిపింది.

కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు చిన్నంనాయుడు, జిల్లా గౌరవాధ్యక్షులు సిహెచ్ పడాల్, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా నాయకులు కుమారి, ఈశ్వరి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్, జీవన్, ఆదివాసీకళాకారుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి,కృష్ణారావు , తామల్ల జోషి, మాతృభాషా ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొర్ర శ్రీను, జిల్లా అధ్యక్షులు మర్రి చిట్టిబాబు, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు సుందరరావు,లక్కు, సూరిబాబు బుజ్జిబాబు, బుజ్జన్న, శరబన్న, సన్యాసిదొర, పాపారావు పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన ఆదివానీ గిరిజన సంఘం నేతలు, గిరిజనులు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

నేటి నుంచి పివిటిజి గృహాల సర్వే

పాడేరు: పివిటిజిల గృహాలు, ఆవాసాలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశ్యంతో చేపట్టిన ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయడానికి ఎంపిడిఓలు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. గురువారం ఎంపిడిఒలు, సచివాలయ సిబ్బందితో కలెక్టరేట్ నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, పివిటిజిలకు సురక్షిత గర్భుృహాలు, స్వచ్ఛమైన తాగునీరు, పారిశుధ్యం, విద్య, ఆరోగ్యం, పోషకాహారం, మెరుగైన రహదారి, టెలికాం కనెక్టివిటీ వంటి అవసరమైన సౌకర్యాలను అందించడమే పిఎం జన్‌మన్ ముఖ్య ఉద్దేశమన్నారు. వారికి అన్ని సౌకర్యాలు కల్పించడానికి వీలుగా తొమ్మిదవ తేదీ శుక్రవారం నుండి పివిటిజిల గృహాలను ఇంటి ఇంటి సర్వే నిర్వహించి వారి అవసరాలను గుర్తించాలని ఆదేశించారు.

ఇదివరకు సర్వే నిర్వహించినప్పటికీ, అదనపు వివరాలతో కూడిన యాప్ ద్వారా మరోసారి సర్వే నిర్వహించి లోపాలను, అవసరాలను గుర్తించాలన్నారు. మౌలిక సదుపాయాలను మెరుగుపరచి ఆరోగ్యం, విద్య, జీవనోపాధిలో అంతరాలను తగ్గించడం ద్వారా పివిటిజిల సామాజిక-ఆర్థిక స్థితిని మెరుగుపరచడం లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటిడిఎ పిఒలు వి.అభిషేక్, కె.సింహాచలం, వి.చైతన్యం డిఎల్‌డిఒ శాంతలక్ష్మి, గ్రామ వార్డు సచివాలయాల జిల్లా కో ఆర్డినేటర్ కె.సునీల్ ఎంపిడిఒలు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి-పాడేరు : ఈ నెల 9న శుక్రవారం నిర్వహించాల్సిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికను రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ ప్రకటించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడం, శుక్రవారం ఆదివాసీ దినోత్సవాన్ని ఐటిడిఎ సమావేశ మందిరంలో నిర్వహించడం వంటి కారణాలతో 'మీకోసం' రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. వివిధ సమస్యలపై దరఖాస్తులు అందించడానికి ప్రజలెవ్వరూ రావద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేసారు. ఐతే అదే ప్రాంగణంలో నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని, రక్తదాన శిబిరంలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

రైతులకు సిల్వర్ వోక్ మొక్కల పంపిణీ



సిల్వర్ మొక్కలు పంపిణీ చేస్తున్న ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని దిగుడుపుట్టు గ్రామంలో ఆరుగురు, సంతరి పంచాయతీకి చెందిన 32 మంది గిరిజన రైతులకు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ గురువారం సిల్వర్‌వోక్ మొక్కలు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ, సిల్వర్‌వోక్ మొక్కలను అంతర్ పంటగా వేసుకుని ఆర్థికాభివృద్ధి చెందాలని రైతులకు సూచించారు. మండలంలోని 38 రైతులకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 26,600 మొక్కలు పంపిణీ చేశామన్నారు.

సిల్వర్‌వోక్ మొక్కల పెంపకంలో భాగంగా పొలాల్లోని తుప్పలు తొలగించడం, దుక్కులు, గుంతలు తవ్వడం, మొక్కలు నాటడం, లైన్ అలైన్మెంట్, మొక్కల సంరక్షణకు లైఫ్‌ఫెన్సింగ్, ఎరువులు ఇలా మూడేళ్లపాటు ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ప్రోత్సాహకం అందుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గిరిజనుల జీవనోపాధికి, వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వపరంగా అందిస్తున్న సిల్వర్‌వోక్ మొక్కలను సంరక్షించి, బాగుపడాలని పిఒ అభిషేక్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో అరకు, పాడేరు ఎపిడిలు పవన్, శ్రీనివాస్, హుకుంపేట ఇఒపిఆర్‌డి, ఎపిఒ మూర్తి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఎస్‌టి విద్యా వాలంటీర్లను కొనసాగించాలి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: గతంలో పాఠశాలలు లేని గ్రామాల్లో పనిచేసిన ఎన్‌ఆర్‌ఎస్‌టి విద్యా వాలంటీర్లను కొనసాగించాలని విద్యా వాలంటీర్ కె.సాంబమూర్తి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బడిఈడు పిల్లలున్నా, పాఠశాలలు లేని గ్రామాల్లో గతంలో ఐదేళ్లపాటు ఎన్‌ఆర్‌ఎస్‌టి విద్య వాలంటీర్లుగా పనిచేసి, గిరిబాలల విద్యాభివృద్ధికి దోహదపడ్డామన్నారు. అయితే మళ్లీ ఈ ఏడాదిలో ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఎస్‌టి విద్యా వాలంటీర్లను నియమించేందుకు చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో గతంలో పనిచేసిన వారికి ప్రాధాన్యత కల్పించాలని కోరారు. తమకు 18 నెలల వేతనాలు కూడా చెల్లించలేదని, తక్షణమే చెల్లించాలని కోరారు.

అడవుల కార్పొరేటీకరణను ప్రతిఘటిద్దాం

ఎఐకెఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంకల మాధవరావు



మాట్లాడుతున్న వంకల మాధవరావు

ప్రజాశక్తి-దేవీపట్నం


అడవులు కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఆదివాసీల అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి ప్రపంచ ఆదివాసీ దినోత్సవం స్ఫూర్తితో ప్రతిఘటన పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐకెఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంకల మాధవరావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని గంగవరం గ్రామంలో గురువారం ఆదివాసి సదస్సు నిర్వహించారు. సంఘం రంపచోడవరం డివిజన్ అధ్యక్షులు విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షన జరిగిన ఈ సదస్సులో మాధవరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ఆదివాసీలకు ఆసరాగా ఉన్న చట్టాలను సైతం మార్చివేస్తుయని, 1980 అటవీ హక్కుల చట్టాన్ని 2023 అటవీ సంరక్షణ నియమాల పేరుతో సవరణ చేశారని తెలిపారు. ఈ సవరణ చేసిన చట్టం అత్యంత ప్రమాదకరమైనదని, అడవుల నుండి ఆదివాసీలను గెంటివేతకి ఈ చట్టం దోహదం చేస్తుందని చెప్పారు. అడవుల్లో ఉన్న ఖనిజ సంపదను, కలపను, భూములను కార్పొరేట్ సంస్థకు కట్టబెట్టడానికి మోడీ సర్కార్ పూనుకుందని విమర్శించారు. 30 ఏళ్లగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్లు హస్తగతం చేసుకున్నారని, ఇప్పుడు అడవుల మీద వారి కన్నులు పడ్డాయని పేర్కొన్నారు. అడవులను సంరక్షించుకోవడానికి పర్యావరణాన్ని కాపాడుకోవడానికి చేసే పోరాటాలకు విద్యార్థులు, మేధావులు, ప్రగతిశీల శక్తులు, ప్రజాస్వామ్యవాదులు అండగా నిలబడాలని కోరారు. ఈ సదస్సులో సంఘం రాష్ట్ర కోశాధికారి బచ్చల బొజ్జి రెడ్డి, జిల్లా నాయకులు బచ్చల సునీత, సోమిరెడ్డి కొండ్ల కండం రెడ్డి, స్థానిక గ్రామ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ బాధితుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హిమబిందు

ప్రజాశక్తి -సీలేరు

సికిల్ సెల్ ఎనీమియా బాధితులు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జీకే వీధి మండలం దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డీకే హిమబిందు అన్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ, పాడేరు ఐటిడిఏ ఆధ్వర్యంలో దారకొండ ఆశ్రమ ఉన్నత పాఠశాల, చిన్న గంగవరం గ్రామాల్లో సికిల్ సెల్ ఎనీమియాపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళా జాతర కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి హిమబిందు మాట్లాడుతూ, జన్యుపరమైన లోపం కారణంగా సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి సంక్రమిస్తుందని తెలిపారు. ఈ వ్యాధి వల్ల ఆయాసం, శ్వాస సంబంధమైన ఇబ్బందులు, రక్తహీనత సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. బాధితులు వైద్యుల పర్యవేక్షణలో ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు చేయించుకోవాలని, హిమోగ్లోబిన్ శాతం తగ్గితే రక్తం ఎక్కించడం జరుగుతుందని తెలిపారు. వైద్యుల పర్యవేక్షణలో మందులు క్రమంగా తప్పకుండా వాడడం వల్ల బాధితులు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. సికిల్ సెల్ ఎనీమియాపై ప్రజల్లో సంపూర్ణ అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ ఈవో పోతురాజు, ఎమ్మెల్‌హెచ్‌పిలు నాగమణి, లోవ కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళా బృందం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గిరిజన యువకుడు ఆదంరెడ్డి

పాము కాటుకు గురైన గిరిజన యువకుడు

అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మండలంలోని చట్లవాడ గ్రామానికి చెందిన ఆదం రెడ్డి అనే గిరిజన యువకుడు పాము కాటు గురయ్యాడు. దీంతో బంధువులు అతన్ని బోదులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యశాల నిమిత్తం మండల కేంద్రానికి తీసుకురావడానికి ఆ పిహెచ్‌సిలో అంబులెన్స్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది .దీంతో ప్రైవేటు వాహనంలో ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయ స్థితి నుండి తప్పించుకోవడం జరిగింది. దీంతో బంధువులు ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై చట్లవాడ సర్పంచ్ డి.ప్రేమలత మాట్లాడుతూ అంబులెన్స్ సౌకర్యం లేక పంచాయతీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, తక్షణమే రోగులకు అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై బోదులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యంను వివరణ కోరగా అంబులెన్స్ మరమ్మతుల నిమిత్తం రాజమహేంద్రవరం పంపించడం జరిగిందని, మరమ్మతులు పూర్తయినా బిల్లులు చెల్లించకపోవడంతో మెకానిక్ షెడ్ వద్దనే ఉందని పేర్కొన్నారు. ఐటిడిఎ పిఒ బిల్లుపై సంతకాలు చేస్తే అంబులెన్స్ బయటకు వస్తుందని తెలిపారు. తక్షణమే ఐటిడిఏ అధికారి స్పందించి బోదులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అంబులెన్స్ ఏర్పాటు చేయాలని సర్పంచ్, గ్రామస్తులు కోరుతున్నారు.

బుద్ధదేవ్ మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటు

ప్రజాశక్తి-విఆర్.పురం

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టాచార్య మరణం వామపక్ష ఉద్యమానికి, ముఖ్యంగా సిపిఎంకు తీరని లోటని సిపిఎం ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. బుద్ధదేవ్ మృతి పట్ల గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సిపిఎం నాయకులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, ఎంపీపీ కారం లక్ష్మి, సర్పంచ్‌లు కారం బుచ్చమ్మ, పులి సంతోష్ కుమార్, మాజీ సర్పంచ్ కుంజ నాగిరెడ్డి, నాయకులు వడ్లది రమేష్, కారం సత్యం, కె.సత్యనారాయణ, గుండుపూడి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కూనవరం : కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి సీపీఎం నాయకులు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు మాట్లాడుతూ కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టాచార్య 2000 సంవత్సరం నుండి 2011 వరకు 11 ఏళ్ల పాటు పశ్చిమ బెంగాల్ ముఖ్య మంత్రిగా విశేష సేవలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సిపిఎం నాయకులు తలగాని నాగరాజు, గడ్డిపాటి షణ్ముకేశ్వరావు, శ్యామల కృష్ణ, నోముల సత్యనారాయణ, తాళ్లూరి శ్రీనివాసరావు, పాయం సీతారామయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- కూనవరం

వరదల అనంతరం సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మండలంలోని కూటూరు పంచాయతీ సర్పంచ్ బొగ్గ వెంకమ్మ అన్నారు. కూటూరూ పంచాయితీ వద్ద గురువారం సర్పంచ్ వెంకమ్మ అధ్యక్షతన పోస్ట్ ఫ్లడ్‌పై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ పరిశుభ్రత పాటించాలని, వేడి చేసిన నీటినే తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు, మేకల నాగేశ్వరరావు, తుంగల కన్నారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో సమస్యలపై ఐటిడిఎ పిఒకు వినతి

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు మండల కేంద్రంలోని బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలపై ఐటిడిఎ పిఒ కావూరి చైతన్యకు స్థానిక యువకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చింతూరు బస్టాండ్ పరిస్థితి అధ్వానంగా ఉందని, ఎటు చూసినా అపరిశుభ్రత, దుర్వాసన వెదజల్లుతుందని, దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రాష్ట్రాల సరిహద్దు అయిన చింతూరు బస్టాండ్ అభివృద్ధికి నోచుకోకుండా దయనీయంగా ఉందని, క్రిమి కీటకాలు, పాములకు స్థావరంగా మారిందని తెలిపారు. కనీస భద్రత కరువైందని, లైట్లు కూడా లేకపోవడంతో రాత్రి సమయంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. తక్షణమే బస్టాండ్‌కి ఒక మనిషిని నియమించి పరిశుభ్రంగా ఉంచాలని, బస్టాండ్‌ను అభివృద్ధి చేయాలని కోరారు. దీనిపై పిఒ సానుకూలంగా స్పందించి వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో స్థానిక యువకులు మల్లిపూడి సతీష్, వీరబోయిన రాజ్ కుమార్, షాహీద్, వెంకన్న, ఎస్‌కె.సమీర్ తదితరులున్నారు.



ఐటిడిఎ పిఒ చైతన్యకు వినతిపత్రం ఇస్తున్న యువకులు

విధులకు ఉపాధ్యాయుడు డుమ్మా

-వీధిన పడ్డ విద్యార్థులు
-రెండు నెలలుగా ఇదే పరిస్థితి
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు
- పర్యవేక్షణ లేని విద్యాశాఖాధికారులు
- శాఖాపరమైన చర్యల్లో అలసత్వం


ఇరగాయి పాఠశాల

ప్రజాశక్తి -అరకులోయ రూరల్ : మండలంలోని ఇరగాయి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గత రెండు నెలలుగా ప్రతిరోజూ విధులకు డుమ్మా కొడుతూ, విద్యార్థుల భవిష్యత్‌ను రోడ్డున పడేశారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఈ విద్యాసంవత్సరంలో పాఠశాల పునఃప్రారంభమై రెండు నెలలు గడిచిన, ఇప్పటి వరకు ఉపాధ్యాయుడు పాఠశాలకు హాజరు కావడం లేదని తల్లిదండ్రులు తెలిపారు. పాఠశాలలో సుమారు 25 మంది విద్యార్థులు ఉన్నారని, ఉపాధ్యాయుడు లేకపోవడంతో వీరంతా పాఠశాలకు వస్తున్నా, చదువుకోవడం లేకపోవడంతో రోడ్డుపైనే ఆటలాడుకుంటున్నారని వాపోయారు. ఇంతజరుగుతున్నా , ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం విడ్డూరమని ఆవేదన చెందుతున్నారు. దీనిపై గతంలో జిల్లా కలెక్టర్ స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. పిల్లలు పాఠశాలకు వస్తున్నా చదువులు సాగడం లేదని, ఆటాడుకుంటూ, కాలాన్ని గడిపేస్తూ తర్వాత ఇళ్లకు చేరుకుంటున్నారని, ఇలాగైతే వారికి అక్షరాలు ఎలా వస్తాయని ప్రశ్నిస్తున్నారు. గత విద్యాసంవత్సరంలోనూ అంతకుముందు కూడా ఇదే పరిస్థితి ఉందని, సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు చేపట్టకపోవడం దారుణమనివారు వ్యక్తం చేస్తున్నారు, ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి, ఇరగాయిలో విధులకు డుమ్మా కొడుతున్న ఉపాధ్యాయుడిపై శాఖాపరమైన చర్యలు తీసుకుని, మరో ఉపాధ్యాయుడు నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


రహదారిపై ఆటలాడుకుంటున్న బడి పిల్లలు

పలుసార్లు మందలించాం : ఎంఇఒలు

ఇరగాయి పాఠశాల దుస్థితిపై ఎంఇఒలు భారతిరత్న, వి మోహనరావు వివరణ కోరగా, గత మూడేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని, సమయపాలన పాటించని ఉపాధ్యాయుడిని అనేకసార్లు మందలించినా అతని తీరు మారడం లేదన్నారు. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. ఫేసియల్ హాజరు వేసుకుని, పాఠశాలకు రాకుండా నెలసరి జీతాలు తీసుకుంటున్నారని గ్రామస్తులు, విద్యార్థి తల్లిదండ్రులు తాజా ఫిర్యాదుతో మళ్లీ మందలించినా తీరు మారడం లేదన్నారు.


తరగతి గదిలో ఉన్న కొందరు విద్యార్థులు


వివరాలు వెల్లడిస్తున్న సిఐ చంద్రశేఖర్

హత్యకేసులో ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: డుంబ్రిగుడ మండలం కొర్రాయి పంచాయతీ, బొండుగూడ గ్రామంలో సమీపంలో జరిగిన హత్య కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు అరకులోయ సిఐ సిహెచ్ రుద్రశేఖర్ తెలిపారు. గురువారం అరకులోయలో మీడియాతో మాట్లాడుతూ, విశాఖపట్నం, కంచరపాలెం నుండి గతనెల 30వ తేదీన విహారయాత్రకు వచ్చిన నలుగురు స్నేహితులతో డుంబ్రిగుడ మండలం బొండుగూడ గ్రామ సమీప పొలంలో గంజాయి మత్తులో ఉన్న స్థానిక యువకులు గొడవపడ్డారు. ఈ క్రమంలో చంద్రకాంత్‌ను హత్య చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. రాజు అనే వ్యక్తితో వీరు నలుగురికి ఇంతకు ముందే పరిచయం ఉందని విచారణలో తేలినట్లు తెలిపారు. పర్యటనలో ముగ్గురు యువకులు తప్పించుకొని పారిపోయారని, అయితే చంద్రకాంత్ దొరికిపోవడంతో హత్య చేయబడ్డాడని తెలిపారు. ఐదురుగు నిందితులతో పాటు ముగ్గురు మైనర్లు కూడా హత్యలో కేసులో ఉన్నట్లు గుర్తించామన్నారు.

బొండుగూడ సమీపంలో వాగులో చంద్రకాంత్ మృతదేహాన్ని గమనించిన ముకుంద అనే రైతు స్థానిక సర్పంచ్ ద్వారా పోలీసులకు సమాచారం చేరవేసారని సిఐ రుద్ర శేఖర్ తెలిపారు. దీనిపై సమగ్ర దర్యాప్తు అనంతరం హత్యకేసును ఛేదించి, నిందితులు పాంగి రాజ్‌కుమార్, తాంగుల అజయ్‌లాల్, శెట్టి కిరణ్, వంతాల హేమరాజు, బురిడీ చైతన్యలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.


కళాజాతాను తిలకిస్తున్న గిరిజనులు

సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహనకు కళాజాతా

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహనకు డుంబ్రిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిఎస్ఆర్ రూరల్ మీడియా కళాజాతా జైశంకర్, శివశంకర్ బృందం ఆధ్వర్యంలో గురువారం కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి సోకిన వారికి ఏ విధమైన వైద్య సేవలు చేసుకోవాలనే దానిపై గేయాలు, నృత్యాల రూపంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి పి రాంబాబు మాట్లాడుతూ సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తులకు అకస్మాత్తుగా రక్తంశాతం తగ్గి, అస్వస్థతకు గురౌతారని, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి సరైన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వపరంగా ఈ వ్యాధిపై అవగాహనకు ప్రతి గ్రామంలోనూ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ వ్యాధి నివారణకు ప్రభుత్వం అందించే సలహా సూచనలను తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ అంబిక , ఎంపిహెచ్‌ఇఒ జె శౌరి, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

అవయవదాతలకు ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : అవయవదాతలకు అంతిమ సంస్కారాలను ఇకపై రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించనుందని, దీనికి సంబంధించి గురువారం ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటి.కృష్ణబాబు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారని రాష్ట్ర జీవన్‌ధాన్ కో-ఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. ప్రజల్లో అవయవ దానంపై అవగాహన కల్పించి, బ్రెయిన్‌డెడ్ అయిన వారి అవయవాలను అవసరార్థులకు అమర్చడం ద్వారా పునర్జన్మను కల్పించే అవయవ దాతల అంతిమ సంస్కారాలను ఆర్‌డిఒ స్థాయికి తక్కువ కాని అధికారుల నేతృత్వంలో ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించేందుకు అవసరమైన నియమావళిని పేర్కొంటూ ఎపి ప్రభుత్వ ఉత్తర్వులు చేసిందని వివరించారు.

పిఎసిఎస్‌ల బలోపేతానికి చర్యలు

జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు : జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను బలోపేతం చేసి, సంఘాలు ఆర్థిక పరిపుష్టి సాధించే దిశగా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా సహకార సంస్థ అధికారులను కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశానికి అధ్యక్షతన వహించిన కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న 22 సహకార సంఘాల్లో కొన్నింటిలో కొంతమంది సభ్యులు రుణాలు చెల్లించడంలో అశ్రద్ధ వహిస్తున్నారని, వాటి వసూలుపై దృష్టి పెట్టాలన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా వ్యవసాయ రుణాలు పంపిణీ విస్తృతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎకరాకు రూ.లక్ష రూపాయలు మాత్రమె వ్యవసాయ రుణాలు ఇస్తున్నప్పటికీ, రుణాలు వసూలు చేయడంలో శ్రద్ధ కనపరచక పోవడం పట్ల అసహనం వ్యక్త పరిచారు. సహకార సంఘాల పేరుతో జరుగుతున్నా మోసాలను అరికట్టాలని సూచించారు. 60 ఏళ్లుగా కొనసాగుతున్న సహకార సంఘాల వ్యవస్థలో ఉన్న విధానాలను మార్చవలసిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తం చేసిన కలెక్టర్, అవకతవకలు జరిగితే చర్యలు తీసుకోవాలన్నారు. సహకార శాఖ అధికారులు సంఘాలను స్వంతంగా భావించాలని, సహకార సంఘాల కార్యదర్శులను భాగస్వామ్యం కల్పించి వారికి తగు సూచనలు, సలహాలు అందించాలని కోరారు. జిల్లాలో నిర్మిస్తున్న 42 గోదాముల్లో పూర్తైన ఐదింటిని అద్దెకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని సంఘాలలో కంప్యూటరీకరణ జరగాలని ఆదేశించారు. చాలా మండలాలలో సహకార సంఘాలకు స్వంత భవనాలు లేనందున, మండల కేంద్రం సచివాలయాలలో నిర్మించిన స్టోర్ రూములను వారికి కేటాయించాలని జెసిని ఆదేశించారు. ఆయా గదులకు కిటికీ ఏర్పాటు, విద్యుత్ సౌకర్యం, నెట్ కనెక్టివిటీ ఏర్పాటు చేసుకోవాలని సహకార కేంద్ర బ్యాంకు అధికారులను ఆదేశించారు. ఇ. కిషాన్ ఉపజ్ నిధి కింద గోదాములకు అక్రెడిటేషన్ చేయించాలన్నారు. డిఆర్‌డిఎకు చెందిన మహిళా సంఘాల సభ్యులకు వ్యవసాయేతర రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు. కమిటీ సమావేశంలో సంయుక్త కలెక్టర్ డాక్టర్ ఎంజె. అభిషేక్ గౌడ్, సహకార అధికారి ఎంవి. రామకృష్ణంరాజు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బిఎస్ నంద్, పశు సంవర్ధక అధికారి నరశింహులు, మత్స్య శాఖాధికారి శ్రీనివాసరావు, డిసిసిబి జనరల్ మేనేజర్లు శ్రీనివాసరావు, శ్రీధర్ చౌదరి, డిసిసిబి మేనేజర్లు, ఇఇ కొండయ్య పడాల్, సహకార శాఖ ఇన్స్పెక్టరు పాల్గొన్నారు

పాఠశాలల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

పాడేరు : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి విద్యా ప్రమాణాలు మెరుగు పరచాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్ .దినేష్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంఇఒలు, ఎటిడబ్ల్యూలతో గురువారం సమావేశం నిర్వహించారు. చింతూరు, రంపచోడవరం అధికారులతో పర్చువల్ విధానంలో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధార్ నమోదుతో విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలని 'సూచించారు. ఎంఇఒలు తప్పని సరిగా పాఠశాలలను తనిఖీ చేసి విద్యా ప్రమాణాలు మెరుగుపరచడానికి చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలకు రాకుండా బినామీ ఉపాధ్యాయులతో నడిపిస్తే ఎంఇఒలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెండు నెలలైనా ఎన్‌రోల్‌మెంట్ పూర్తి చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. మండలాల వారీగా ఎంత మంది విద్యార్థులు ఉన్నారని ఎంఇఒలను అడిగి తెలుసు కున్నారు. అందుబాటులో నెట్ వర్కు ఉన్నచోటుకు వెళ్లి ఫేషియల్ అటెండెన్సు వేసి పాఠశాలకు హాజరు కావాలన్నారు. ఈనెల 17 పాఠశాల విద్యా కమిటీలు ఎన్నికలు నిర్వహించి వెంటనే కమిటీలతో ప్రమాణ స్వీకారం చేయించాలని సూచించారు. 18 వతేదీ నుండి పాఠశాలలో తాగునీరు, విద్యుత్తు వంటి మౌకలి సదుపాయాల పనులు చేయాలన్నారు. మౌలిక సదుపాయాలు కల్పనకు రూ.2.5కోట్ల అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళికలు తయారు చేసి అమలు చేయాలన్నారు. విద్యార్థులకు కనీసం చదవటం, రాయడం రావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేసారు


మాట్లాడుతున్న సిఐ రమేష్

డ్రగ్స్ అనర్ధాలపై అవగాహన

ప్రజాశక్తి -జి మాడుగుల: గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై మారుమూల ప్రాంతంలో బొయితిలి పంచాయతీ కేంద్రంలో గిరిజనులకు స్థానిక సీఐ రమేష్ గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ రమేష్ మాట్లాడుతూ గంజాయి పండించడం, రవాణా చేయడం మధ్యవర్తులుగా వ్యవహరించడం చట్టరీత్యా నేరమన్నారు. అలాగే నాటుసారా తయారీ, సరఫరా, అమ్మకాలు కూడా నేరమన్నారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడితే సమాచారమివ్వాలని కోరారు.ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో పిల్లలకూ డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై వివరించారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని, సంబంధిత అధికారులకు విన్నవించి, పరిష్కారానికి కృషి చేస్తామని సిఐ భరోసానిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాంబాబు, ఎంపిటిసి అప్పలరాజు, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పోలీస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు

గణాత్మక రసాయనశాస్త్రంపై గీతం కోర్సు

ప్రజాశక్తి -మధురవాడ : రసాయన శాస్త్రంలో అణువులు, పదార్థ నిర్మాణం, వాటి గుణాలను కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఉపయోగించి ఖచ్చితంగా లెక్కించడానికి ఉపయోగపడే గణాత్మక రసాయనశాస్త్రం నైపుణ్యాలపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యాన గురువారం ప్రత్యేక సర్టిఫికెట్ కోర్సును ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు ప్రారంభించారు.


మాట్లాడుతున్న సిఐ వెంకటేశ్వరరావు

గంజాయి వల్ల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి-రంపచోడవరం : గంజాయి వల్ల అనర్థాలపై స్థానిక సిఐ వాసా వెంకటేశ్వరరావు, ఎస్ఐ మోహన్ కుమార్ ఆధ్వర్యాన గురువారం మండలంలోని పెద్ద గెద్దాడ గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. గంజాయి రవాణా, వాడకాన్ని నివారించాలన్నారు. యువత మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురవుతున్నారని, మద్యం సేవించి వాహనాలు నడప వద్దని హితువుపలికారు.

వలకు చిక్కిన 15 కిలోల శీలావతి చేప

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరు జలాశయంలో 15 కేజీల శీలావతి జాతికి చెందిన చేప గురువారం మత్స్యకారుల వలకు చిక్కింది. దీనికి కొనుగోలు చేసేందుకు స్థానికులు ఎగబడ్డారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-సీలేరు : రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్‌లను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వి.శంకర్రావు మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదల, దఢ సంకల్పంతో కృషి చేస్తే సాధించలేనిది ఏమీ ఉండదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కామర్స్ అధ్యాపకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్ పవర్ కార్మికులుగా మార్పుపై హర్షం

ప్రజాశక్తి-మోతుగూడెం : ఏపీ జెన్కో దిగువ, ఎగువ సీలేరు జల విద్యుత్ కేంద్రాల్లో 15 సంవత్సరాలుగా పీస్ వర్కర్లుగా పని చేస్తున్న 17 మందిని మ్యాన్ పవర్‌గా మార్పు చేయడం పట్ల యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకులు చింత రాంబాబు, జె.రత్నాకర్, బీవీ రమణ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తమ యూనియన్ పోరాటం ఫలితంగానే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్నప్పుడు నుండి సిఐటియు నాయకులు ఆర్.సుధాభాస్కర్, డి.సూరిబాబు, కిరణ్ నాయకత్వంలో అలుపెరగని పోరాటాలు చేసినట్లు చెప్పారు. ఈ పోరాటాల మూలంగానే 2014లో కాంట్రాక్ట్ కార్మికులను జెఎల్‌ఎంగా పర్మనెంట్ చేశారని, ఎగువ, దిగువ సీలేరులో 152 మందిని పర్మినెంట్ చేశారని గుర్తు చేశారు. ఈ సమయంలో ప్రభుత్వాలు నిరంకుశ వైఖరి అవలంభించినా, బెదిరింపులకు దిగినా ఎక్కడా లొంగకుండా సిఐటియు ఆధ్వర్యాన సమరశీల పోరాటాలు చేసినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇదే విధంగా పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఫిషింగ్ బోటుకు ప్రమాదం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వేటకు వెళ్లి తిరిగి వస్తున్న ఫిషింగ్ బోటు గురువారం సాయంత్రం ఆర్‌కె బీచ్ వద్ద ప్రమాదానికి గురైంది. బోటుకు అడుగున ఉన్న ఫ్యాన్ రెక్కలు ఆ ప్రాంతంలో సముద్రంలో ఉన్న రాళ్లకు చిక్కుకోవడంతో ప్రమాదం జరిగిందని మత్స్యకారులు తెలిపారు. ప్రమాదం నుంచి ఐదుగురు మత్స్యకారులు సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అయితే బోటుకు మాత్రం రూ.20 లక్షలు మేర నష్టం కలిగిందని విశాఖపట్నం హార్బర్ బోటు యజమానుల సంఘం అధ్యక్షులు వాసుపల్లి జానకిరామ్ మీడియాకు తెలిపారు.

నిరుపేదలకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని డిఎల్ రెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేదలకు గురువారం బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. రైల్వే న్యూకాలనీ, ద్వారకానగర్, దొండపర్తి, రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాలలో ఈ కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా ధర్మాల ఫౌండేషన్స్ అధ్యక్షులు ధర్మాల ఆనంద్ కుమార్ రెడ్డి మాట్లాడారు.

తర్జనభర్జనలు

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిపై తేల్చుకోలేని టిడిపి
- పరిశీలనలో ఐదుగురు
- దిలీప్ చక్రవర్తిపై చంద్రబాబు మొగ్గు
- వ్యతిరేకిస్తున్న స్థానిక నాయకత్వం
-బొత్స వీగిపోకూడదన్న పట్టుదలతో వైసిపి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నిక నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనా టిడిపి తన అభ్యర్థిని ప్రకటించుకోలేక తర్జనభర్జనలు పడుతోంది. కూటమి పార్టీలకు ఓట్లు తక్కువ ఉండడంతో గెలవడానికి సరిపడా ఓట్లను రాబట్టుకోవడం కోసం ఖర్చుకు వెనుకాడని సరైన వ్యక్తిని ఎంపిక చేయడానికి జరుగుతున్న కసరత్తులో ఈ జాప్యం నెలకొంది. గురువారం జరిగిన టిడిపి పొలిట్‌బ్యూరో సమావేశంలో సైతం ఎమ్మెల్సీ అభ్యర్థిని నిర్ణయించలేకపోయారు. కొద్ది రోజుల క్రితమే వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను ఆ పార్టీ ప్రకటించింది. స్థానిక సంస్థల ఓటర్ల బలంతో పాటు ఎన్నికల నిర్వహణ నైపుణ్యం కలిగిన బొత్సను బరిలోకి వైసిపి దించడంతో ఆయనకు ధీటైన వ్యక్తిని బరిలోకి దించాలన్న ఆలోచనతో అభ్యర్థి ఎంపికలో పొరపాటు జరగకుండా టిడిపి గట్టి కసరత్తు చేస్తోంది. ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపికలో పార్టీ సేవలు, అనుభవానికి ప్రాధాన్యత ఇవ్వకుండా ఎలాగైనా గెలవగలిగిన వ్యక్తి కోసమే అన్వేషిస్తోంది.

అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి, టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు, మాడుగుల నియోజకవర్గ నాయకులు పివిజి కుమార్, బైరా దిలీప్ చక్రవరి పేర్లు పరిశీలనలో వున్నట్లు ప్రచారం జరుగుతోంది. పీలాను ఎమ్మెల్సీ అభ్యర్థిగా చంద్రబాబు ప్రకటిస్తారని బుధవారం వరకు నాయకత్వం భావించింది. అభ్యర్థి ప్రకటనలో జాప్యం జరగడంతో అనేక అనుమానాలకు తావిస్తోంది. డబ్బులు ఖర్చు పెట్టగలిగిన దిలీప్ చక్రవర్తిని బరిలోకి దింపితే బాగుంటుందన్న ఆలోచనలో చంద్రబాబు వున్నట్లు తెలుస్తోంది. పీలాను బరిలోకి దించాలని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా టిడిపి అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు ఏకాభిప్రాయానికి వచ్చి టిడిపి అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినా దిలీప్ చక్రవర్తి పట్ల చంద్రబాబు మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. చక్రవర్తికి అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్ మద్దతు ఇస్తున్నట్లు తెలిసింది. సార్వత్రిక ఎన్నికల నుంచి దిలీప్ చక్రవర్తి విషయంలో అయ్యన్నపాత్రుడు అభ్యంతరం తెలుపుతూ వస్తున్నారు. అనకాపల్లి ఎంపీ టిక్కెట్ చక్రవర్తి ఆశించినా ఆయనకు దక్కకుండా చేయడంలో కృతకృతులయ్యారు. పీలా పట్ల అయ్యన్నపాత్రుడు సహా టిడిపి ఎమ్మెల్యేలు సానుకూలంగా వున్నారు. అభ్యర్థి ఎంపికలో చంద్రబాబుకు తేల్చుకోలేక ప్రకటించకుండా వాయిదావేస్తూ వస్తున్నారు. ఇదిలావుండగా.. ఓటర్ల రీత్యా కూటమి పార్టీల కంటే వైసిపి బలం ఎక్కువగా వుంది. వైసిపిని వీడ్డానికి సుముఖంగా వున్న ఎంపిటిసిల వివరాలను నియోజకవర్గాల వారీగా సేకరించి పనిలో కూటమి ఎమ్మెల్యేలు వున్నారు. తమకు బలంలేకున్నా ఎమ్మెల్సీ స్థానం వైసిపికి దక్కకూడదన్న పట్టుదలతో టిడిపి వుంది. ఏజెన్సీలో స్థానిక సంస్థల్లో తమ పట్టు పెంచుకొనేందుకు వైసిపి ఎంపిటిసిలను తమవైపునకు లాగేసుకోవాలని టిడిపి గట్టి ప్రయత్నాలు చేస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో పాడేరు, అరకు నియోజకవర్గాలతో పాటు అరకు పార్లమెంట్ స్థానాన్ని వైసిపి దక్కించుకుంది. ఆ బలాన్ని దెబ్బతీసేందుకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికను తమకు అనుకూలంగా మలచుకోవాలని టిడిపి నాయకత్వం గట్టి ప్రయత్నం చేస్తోంది.

అయితే తమ బలం చెక్కుచెదరకుండా నియోజకవర్గాల వారీగా పార్టీ నాయకత్వంతో వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి సమావేశాలు నిర్వహించి తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు సూచనలు చేస్తున్నారు. ఎమ్మెల్సీగా బొత్స గెలవడం ద్వారా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో వైసిపి క్యాడర్‌లో నెలకొన్న నిరుత్సాహం పొగొట్టవచ్చన్న ఆలోచనలో జగన్మోహన్‌రెడ్డి వున్నట్లు తెలుస్తోంది. సంఖ్య రీత్యా గెలవగలిగిన బలం వైసిపికి వుండడంతో ఎమ్మెల్సీ పదవి చేజారిపోకుండా నియోజకవర్గాల వారీగా నాయకత్వాన్ని అప్రమత్తం చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే ఉండాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణ చేయరాదని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.దీనబంధు, ఎస్‌కె.హుస్సేన్ అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలేదీక్షలు గురువారానికి 1230వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో పెన్షనర్లు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రం ఇచ్చిన కేవలం ఐదు వేల కోట్ల పెట్టుబడితో ఏర్పడి ప్రభుత్వ రంగంలో దాదాపు 50 ఏళ్లకుపైగా స్టీల్‌ప్లాంట్ లాభాల బాటలో నడిచిందన్నారు. అటు కేంద్రానికి, ఇటు రాష్ట్రానికి వివిధ పన్నుల రూపంలో రూ.50 వేల కోట్ల వరకు ఆదాయం స్టీల్‌ప్లాంట్ ద్వారా లభించిందని తెలిపారు. రిజర్వేషన్లు అమలు జరిగి ఎస్‌సి, ఎస్‌టిలకు, వికలాంగులకు ఉపాధి లభించిందన్నారు. అటువంటి సంస్థను ప్రైవేటీకరణ చేస్తే రిజర్వేషన్లు లేకుండా పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ వ్యక్తులు లాభాపేక్షతో ప్లాంట్‌ను నిర్వహిస్తూ, అవసరమైతే నష్టాల పేరుతో శాశ్వతంగా మూసివేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ విషయాన్ని గుర్తెరిగి కేంద్రం ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయరాదన్నారు. దీక్షలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు కెపి.కుమార్, సభ్యులు కె.నూకరాజు, కెఎం.కుమార మంగళం, వీరభద్రరావు పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాంకు ఆధ్వర్యాన వాక్‌థాన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇండియన్ బ్యాంకు 118వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని డిపాజిట్ల సమీకరణ కోసం ఇండియన్ బ్యాంక్ జోనల్ కార్యాలయం విశాఖపట్నం వారు స్థానిక ఆర్కే బీచ్ రోడ్డులో గురువారం ఉదయం వాక్‌థాన్ నిర్వహించారు. బ్యాంక్ జోనల్ మేనేజర్ అవదేష్ కుమార్ పుర్బే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ బ్యాంక్ చరిత్రను, బ్యాంకు అందిస్తున్న సేవలు, ఇతర కార్యకలాపాలను తెలియజేశారు. ఖాతాదారుల అవసరాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. ఉత్తమ పెట్టుబడి మార్గాలను కల్పించడంలో తమ బ్యాంకు ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.


రహదారి నిర్మాణంలో సోమిరెడ్డిపాలెం వీధి వాసులు

శ్రమదానంతో రహదారి నిర్మాణం

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి - భద్రాచలం రోడ్ నుండి స్థానిక సోమిరెడ్డి పాలెంవీధికి వెళ్లే రోడ్డును స్థానికులు సొంతంగా నిర్మాణం చేసుకున్నారు. సోమిరెడ్డిపాలెంవీధికి వెళ్లడానికి సిసి రోడ్డు లేకపోవడవంతో ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి రోడ్డు బురదమాయంగా మారింది. దీంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ప్రజల ఇబ్బందులపై గత వారం పత్రికల్లో వార్తలు వచ్చినా సంబంధిత అధికారులు స్పందించ లేదు. దీంతో8 గురువారం స్థానిక ప్రజలు సొంత ఖర్చులతో ట్రాక్టర్‌తో రాయిని తెప్పించుకుని, శ్రమదానంతో రాయిని రోడ్‌పై పెర్చడం జరిగింది. ఈ కార్యక్రమంలో భీశెట్టి శ్రీను, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.


గొడుగులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ దుష్యంతుడు

గుర్తేడులో గొడుగుల పంపిణీ

ప్రజాశక్తి -మారేడుమిల్లి : వై.రామవరం మండలం గుర్తేడు పంచాయతీ పరిధిలోని వృద్ధులకు, మహిళలకు పంచాయతీ సర్పంచ్ దుష్యంతుడు ఆధ్వర్యాన గురువారం గొడుగులు పంపిణీ చేశారు. పంచాయతీ పరిధి రావడికోట, జి.వటిగడ్డ, కడారికోట, ఎడ్లకొండ, గుర్తేడు గ్రామాల ప్రజలు వర్షాలకు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని సర్పంచ్ గొడుగులను అందజేశారు.

వినియోగంలోకి నాలుగో యూనిట్

ప్రజాశక్తి - సీలేరు : సీలేరు జల విద్యుత్ కేంద్రంలో నాలుగో యూనిట్ గురువారం నుండి వినియోగంలోకి వచ్చిందని ఏపీ జెన్కో ఈఈ రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు (బస్సు డెక్ట్) నుంచి వర్షపు నీరు చిమ్ముతూ నాలుగో యూనిట్ బస్ బారులో నీరు చేరి ఎర్త్ సమస్య ఏర్పడంతో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిందని పేర్కొన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఎర్త్ సమస్యని నివారించడానికి యుద్ధ ప్రాతిపదికిన పనులు నిర్వహించినట్లు చెప్పారు. ప్రస్తుతం రెండు, మూడు యూనిట్ల నుంచి గ్రిడ్ ఆదేశాలకు అనుగుణంగా నిరాటంకంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామన్నారు. 1వ యూనిట్ అలైన్మెంట్ మరమ్మతు పనులు అభిరామ ఇంజనీరింగ్ కంపెనీ చేస్తుందని, మరో రెండు మూడు రోజుల్లో ఒకటో యూనిట్ నుంచి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించడానికి అన్ని చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వాహనాలలో అధిక లోడు నిబంధనలకు వ్యతిరేకమని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ జె.రాజరత్నం తెలిపారు. గురువారం నగర పరిధిలోని భీమిలి ప్రాంతంలో తాము తనిఖీలు నిర్వహించామన్నారు. అధికలోడుతో వెళుతున్న రెండు వాహనాలను గుర్తించి జరిమానా విధించామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.